# యవనికాభ్యంతరమున...:

"నేను గుంటూర్లో ఉన్నప్పుడు" అన్నాడు భావనారాయణ చాలా బరువుగా మాఅందరికేసీ చూస్తూ.

అందరం సర్దుకూర్చున్నాం.

భావనారాయణ ఓసిగరెట్టు అంటించి, ఆ పొగతోనే అగ్గిపుల్లను ఆర్పేసి, చూపుడువేలుతో సుతారంగా దాన్ని గాల్లోకివిసిరేసి, ఓ పొడిదగ్గుదగ్గి, పట్టనిచెమటను ఓ సారి తుడుచుకొని మెల్లగా ప్రారంభించాడు.

"ఎందుకలా జరుగుతాయో చెప్పలేం! కాని జరుగుతాయి. వాటికి ఎవ్వరూ కారణంకాదు. ఎవ్వరూ అలా జరగాలనికూడా అనుకోరు. కానీ ఏ బలీయమైన విధిశక్తో, పరిస్థితులను అలా గెంటుకుంటూవచ్చి, బ్రతుకులనిండా దుమ్మూ దూగరా నింపేస్తూఉంటుంది. దాన్ని దులుపుకొందుగ్గానీ, ఊపిరిపీల్చుకొందుగ్గానీ అవకాశముండదు. అవంతే! ఎవ్వరినీ మనం నెవపెట్టలేం!" అంటూ ఇరుగ్గా చూశాడు భావనారాయణ.

ఈమధ్యకాలంలో, వాడింత 'బరువు' మనిషి కావడం మేం చూళ్ళేదు.

"డాక్టర్ నారాయణరావు పేరు మీకు తెలిసే ఉంటుంది." అన్నాడు భావనారాయణ, ఓసారి అందరికళ్ళూ వెదుకుతూ.

"నాకో నారాయణరావు తెలుసు. అతనుగూడా డాక్టరే ననుకొంటాను. కాదు డాక్టరే! అతను ఆత్మహత్య చేసుకొన్నాడని ఆమధ్య పత్రికల్లో చదివాను. అతనయితే-" అన్నాను.

'అవును. అతనిసంగతే చెబుతూంట' అన్నాడు భావ నారాయణ. "అతను నాకు స్నేహితుడు. ఆ కారణంగా ఆయన ఆత్మహత్యవిషయం నాకు తెలును - నాకొక్కడికే తెలుసుననుకొంటాను."

"ఏమిటదీ?" అన్నా రెవరో.

"ఇంతకాలం దాన్ని పదిలంగా దాచిపెట్టాను. ఇప్పుడా తెర తొలగించి అతనిఆత్మనుక్షోభపెట్టడం నాకిష్టం లేదు." అన్నాడు భావనారాయణ కాస్సేపాగి. సిగరెట్టును దూరంగా విసిరేసి, సున్నితంగా వేళ్ళను మెటికలువిరుచు కొని, రెండుచేతులూ వెనక్కు ఆనించి, మెడనరాలు చిట పటమనేట్లు విరుచుకొన్నాడు.

"ఒకొక్కమనిషిని చూడంగానే మనకెందుకు సద్భావం కలుగుతుందో ఇంకొకణ్ని చూడంగానే, ఎందుకు అసహ్య మేస్తుందో స్పష్టంగా చెప్పలేం. మనకు సరిపడనిభావాలు, ఇష్టంలేని రూపురేఖలు అవతలివ్యక్తిలో మనం చూడటం ఇందుకు కారణమనుకొంటాను. మన సదభిప్రాయాలు గూడా మన ప్రవృత్తులనుబట్టే ఏర్పడుతుంటాయనుకొం టాను. ఎదటివారిలోని గుణాగుణాలు కేవలం వారివి మాత్రమేగాదనీ, అందులో మనభాగంకూడా కొంత

ఉంటుందనీ మన మొప్పుకొంటే, చాలా సమస్యలకు పరిష్కారం సులభమవుతుందేమోనని పిస్తుంది ... ఎందుకంటున్నానంటే, డాక్టరు నారాయణరావుకూ నాకూ మధ్య అరమరికలు లేకుండా పోవడమేకాదు, దాచుకోవలసినవి కూడా ఏమీ మిగల్లేదు. ఎంతోకొంత కృత్రిమత్వం, ఆత్మవంచన, నటన లేనిదే, వ్యక్తిత్వం పూర్ణరూపానికి రాదనుకొంటాను. మనస్సు జివ్వుమని రొదపెట్టే సత్యంకన్నా తాత్కాలికంగానే అవుగాక - జోగిపోయే అసత్యం కావాలనే మనకుంటుంది. ఈ తెరలు - రంగురంగుల తెరలు - తొలగిపోయాక కనుపించే నగ్నదృశ్యాలను చూడలేం ! చూసినా భరించలేం ! అంచాతనే, చూడకుండా తప్పుకొందుకే మనం ప్రయత్నంచేస్తుంటాం. దురదృష్టవశాత్తూ మా ఇద్దరిమధ్యాఉన్న తెరలను నేనే తీసేశాను" అన్నాడు భావనారాయణ, ఓ క్షణం కళ్ళు గట్టిగా మూసుకొని.

"నారాయణరావు మంచివాడు. అంతకన్నా అతన్ని గురించి చెప్పేందుకు నావల్ల కాదు. ఎంత మంచివాడంటే- ఎంతమంచో చెప్పేందుగ్గూడా మరోమనిషి నా కందుబాటులోలేడు. బ్రతుకు వెలుగులూ, నీడలూ అతను అనుభవించాడు. దరిద్రం కడముట్టా చూశాడు. కష్టాలు దిగమింగాడు. కన్నీరు ఖరీదులేకుండా వెచ్చించాడు. చట్టుమీద మొలిచిన మొక్కలాంటివాడు నారాయణరావు. చట్టుకూ మొక్కకూ జరిగిన సంఘర్షణలో మొక్క గెలిచింది. చట్టు వోడిపోయింది. అయినా అతనిలో గర్వంలేదు. విజయానందం

లేదు. అహంలేదు. గతాన్ని మరిచిపోలేదు. అన్నీ, తేదీలవారీగా చెప్పుకొచ్చేవాడు. దాచేవాడుకాదు. నాకే ఒక్కోసారి అనిపించేది - ఇంతలా ఈ మనిషి బయటపడిపోతున్నాడే - ఇతనంటే గౌరవం తగ్గిపోదా అని !

"నారాయణరావు పెళ్ళి - అదో గమ్మత్తు. మామగారు బాగా ఉన్నవాట్ట. ఎంతో కట్నమిస్తానన్నాట్ట. అయినా మనవాడు వొప్పుకోలేదుట. పోనీ బాగా అర్జనన్నా ఉందా - లేదు. ఏదో న్యాయమంటాడు. ధర్మమంటాడు. అమితంగా డబ్బు పిండుకోవటం అమానుష మంటాడు. ప్రజల అనారోగ్యంమీద బ్రతకటం పాపమంటాడు. రోగంవల్ల బ్రతికే క్రిములకూ డాక్టర్లకూ భేదంలేదంటాడు. అన్నాఫర్వాలేదు. అవన్నీ చేస్తాడు గదా ఖర్మం! అక్కడే నాకు నారాయణరావంటే గిట్టదు. ఆదర్శాలు, ఇంకెన్ని చెప్పినా నా కభ్యంతరంలేదు. ప్రతిరోజూ పత్రికల్లో ఎన్ని ఉద్బోధలు, ఉద్ఘోషలు, ఉద్ఘాటనలు వెలువడుతున్నాయి గాదు! వాటిని విన్నవారుగానీ, చదివినవారుగానీ అవన్నీ ఆచరించే ప్రమాదమే జరిగితే, ముందుతరాలవారు చేసేందుకు మంచిపనే ఉండదే మరి?

"నారాయణరావు మెత్తగానవ్వి, సుఖంగా కుర్చీకి జారగిలబడేవాడు. "ఇంకోరికీ నాకూ పోలికలు తీసుకురాకు. వాళ్ళకు అంతరంగం ఒకటున్నదో లేదో నాకు తెలీదు. కానీ నాకున్నది. మరోమనిషికి నేను సమాధానం చెప్పినా- చెప్పకున్నా, కనీసం నాకు నేనన్నా చెప్పుకో

వాలి. ఇంకో వ్యక్తిని మోసగించినంత సులభంగా మనని మనం మోసగించుకోలేం! ఏమంటావ్?" అనేవాడు నారాయణరావు.

"వాటికి అడ్డమైన పేర్లూ తగిలించి నువ్వు పాడుచేస్తూన్నావనుకొంటాను" అన్నా నోసారి గట్టిగా.

"అదేం?" అన్నాడు నారాయణరావు.

"అందరూ దొంగలై, నువ్వొక్కడివే యోగ్యుడవైనట్టు మాట్లాడకు. మనుషులతో సరిపెట్టుకోలేక పోవడం అసమర్థత అవుతుందిగానీ, ప్రత్యేకత కాదు. అన్యాయంగా ఆర్జించమని నిన్ననడంలేదు. ఆర్జనకు 'అన్యాయం' అంటూ ఓ దిక్కుమాలిన విశేషణం తగిలించకు. నిజం చెప్పాలంటే- ఆపని చెయ్యడం నీవల్ల కాదు. ఆ ధైర్యమూ, చొరవా నీలో లేవు. లేవని ఒప్పుకొనేందుకు నీ కిష్టంలేదు. నువ్వన్నట్టు- నీ అంతరంగం రొదపెడుతుంది. ఆ రొదనుండి పారిపోయేందుగ్గాను, 'అన్యాయం-అధర్మం' అంటూ నీకు నువ్వు నచ్చచెప్పుకొనే ప్రయత్నంలో ఆత్మవంచన చేసుకొంటున్నావనిపిస్తుంది. కాదా?" అన్నాను.

అర్థంచేసుకొనే వ్యక్తి స్థాయినిబట్టి గుణాగుణాలు ఉంటాయనుకొంటాను. ఒక్క భగవద్గీత లక్షమందికి లక్షరకాలుగా కనిపిస్తోంది. ఎవరేంచేస్తారు? ఎవరిది తప్పనగలం? గీతోపదేశం అయ్యాక అర్జునుడు బంధువులను, గురువులను నిర్దాక్షిణ్యంగా చంపాడు. గీతచదివాకనే సర్వంత్యజించినవారినీ

నాకు తెలుసు. కాబట్టే అబ్బాయీ - అంటూ నారాయణ రావు మెత్తగానవ్వి, మాట పూర్తిచెయ్యకుండానే ఆగి పోయాడు.

"ఇలాంటి కబుర్లు గంటలగ్గంటలు తినేసేవి. కానీ ఏదీ తేలేదికాదు. రాత్రి పదింటికి హాస్పిటల్ మూసి వీధి చివర ఇద్దరం విడిపోయేవాళ్ళం. మళ్ళీ ఉదయం కలుసు కొన్నప్పుడు ఇవే గొడవలు ..."

"నారాయణరావు ఏమవుతాడనికాదు నా బెంగ; అతని కుటుంబంసంగతేమిటని! అతనిభార్య ఇంతఉన్న కుటుంబంనించి వచ్చింది. ఇతగాడేదో ఆర్జించి, కుప్పలుపోస్తా డనుకుంది. ... హాయిగా ఉండవచ్చుననుకొంది. నిజాని కా దశలో ఎవరైనా అంతే - అనుకొంటారు. కానీ నారా యణరావు ఫక్తు వ్యతిరేకమయ్యాడు. ఆమె కలలు చిక్కు పడిపోయాయి. వాటిని ఏమాత్రం విడదీయగలిగినా చాలు ననిపించింది నాకు.

"చివరకు నేనే గెలిచాను. నారాయణరావు వోడి పోయాడు. పరిస్థితులుకూడా నన్నే బలపరచాయి. పట్టు మని నాలుగేళ్ళు గడవలేదు. పూర్తిగా మారిపోయాడు నారాయణరావు. ఇన్నేళ్ళతరవాత డబ్బువిలువ తెలుసు కొన్నాడు రావు. తెలుసుకొన్నాక రెండుచేతులా పిండటం ప్రారంభించాడు. ఎదటివారికి నొప్పిలేకుండా, కావలసినపని సానుకూలం చేసుకోవడంలో ప్రావీణ్యం సంపాదించాడు.

రెండుఇళ్ళు కట్టాడు. కారు కొన్నాడు. తమ్ముణ్ణి పెద్దచదువుకు అమెరికా పంపించాడు. మూడునాలుగు బాంకుల్లో డబ్బు నిలవచేశాడు! తనక్రింద మరోనలుగురు డాక్టర్లను చేసుకొన్నాడు. క్షణం తీరికలేకుండా పోయింది నారాయణరావుకు.

"ఇప్పు డేమంటావ్?" అన్నా నోసారి అతగాడితో.

"నువ్వే రైటంటాను" అన్నాడు నారాయణరావు చిరునవ్వుతో. "మంచిదో చెడ్డదో ఉన్న ప్రపంచమిది. దీన్ని మార్చాలన్నా, దీనిలో ఉండే మార్చాలి గానీ, బైటికెళ్ళి కాదు. మనం చెప్పేది ప్రపంచం వినాలనుకొన్నప్పుడు, ప్రపంచం చెప్పేది మనంగూడా వినాలి. అబ్బాయీ— దేనికీ యుద్ధం పరిష్కారంకాదు, సహజీవనం, సహజీవనం" అన్నాడు నారాయణరావు పకపకా నవ్వుతో.

ఆ నవ్వులో ఏదో వెలితి, మురికి ఉన్నట్లనిపించింది నాకు.

అతని పేరూ, ఆర్జనా, ఝుమ్మని పెరిగిపోతున్న తరుణంలో, అతను ఆత్మహత్య చేసుకొన్నాడు. ఎందుకు చేసుకొన్నాడో చాలామందికి తెలీదు. బహుశా నాకొక్కడికే ఆ కారణం తెలుసు ననుకొంటున్నాను" అన్నాడు భావనారాయణ, చేతికంటుకొన్న రేగడిబెడ్డలను దులుపుకొంటూ.

"ఎందుకని చేసుకొన్నాడంటావ్?" అన్నారెవరో ఆదుర్దాగా.

భావనారాయణ బరువుగా నవ్వాడు.

"చెప్పను" అన్నాడు భావనారాయణ తల అడ్డంగా తిప్పుతూ, "ఇప్పటికే అతనిపట్ల చాలా అన్యాయం చేశా ననుకొంటున్నాను. ఆ వాక్యకారణం చెప్పేసి, అతని ఆత్మను మరింత క్షోభపెట్టడం నాకిష్టంలేదు."

బహుశా భావనారాయణకళ్ళల్లో నీరు పూరి వుంటుంది; కాకపోతే జేబుగుడ్డతో కళ్ళ నెందు కొత్తుకొంటాడు మరి?